క్లుప్తంగా

ఉగ్రవాదం పెను ప్రమాదం



ఉగ్రవాద వ్యతిరేక ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఇల్లెందు: ప్రపంచానికి ఉగ్రవాదం పెనుప్రమాదంగా మారిందని, ప్రతిఒక్కరూ తమకు సాధ్యమైనంత వరకు ఉగ్రవాదం అంతానికి పాటుపడాలని సింగరేణి ఏరియా జీఎం షాలేమురాజు అన్నారు. ఆదివారం ఇల్లెందు జీఎం కార్యాలయం వద్ద ఉగ్రవాద వ్యతిరేక దినం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉగ్రవాదం యువతకు ఆశనిపాతంగా మారిందన్నారు. ఎవరో స్వార్థం కోసం చేసే పనులకు మరెవరో బలి కావాల్సి వస్తోందన్నారు. సామాన్యుల మదిలో భయోత్పాతం సృష్టించి ఏమీ సాధించలేరన్నారు. కార్యక్రమంలో ఏరియా సేఫ్టీ ఆఫీసర్ పంజాల శ్రీనివాస్, డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు, డీజీఎం ఫైనాన్స్ రామచంద్ర, ఎన్విరాన్‌మెంట్ అధికారి ధనుంజయ్‌రెడ్డి, సెక్యూరిటీ అధికారి అంజిరెడ్డి, సీనియర్ పర్సనల్ అధికారి శ్రీహరి, గుర్తింపు సంఘం ఉపాధ్యక్షుడు ఎస్.రంగనాథ్ పాల్గొన్నారు.

వైరా ఎమ్మెల్యే పర్యటన



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే రాములు నాయక్

జూలూరుపాడు: మండలంలోని వినోభానగర్, పాపకొల్లు, గుండెపుడి గ్రామాల్లో వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్ ఆదివారం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన పలు వివాహ కార్యక్రమాలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో జూలూరుపాడు ఎంపీపీ లావుడ్యా సోనీ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పొన్నెకంటి సతీష్ కుమార్, జిల్లా నాయకులు వేల్పుల నరసింహారావు, సర్పంచ్‌లు లావుడ్యా కిషన్‌లాల్, భూక్యా పద్మ, రాంశెట్టి రాంబాబు, చౌడం నరసింహారావు, కొదుమూరి కోటేశ్వరరావు, తోట శ్రీను, మోదుగు రామకృష్ణ, బానోత్ ధర్మా, బానోత్ సక్రు, తాళ్లూరి రామారావు, బుడిపూడి ప్రభాకర్, భూక్యా లచ్చిరామ్, ఎస్కే సుబాని, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు



బోనాలతో వెళ్తున్న మహిళలు

జూలూరుపాడు: మండలంలోని సాయిరాంతండాలో ఆదివారం స్థానికులు గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గత ఏడాది గ్రామంలో శ్రీ శీతలాపరమేశ్వరి(బొడ్రాయి), శ్రీముత్యాలమ్మతల్లి, శ్రీపోతురాజు, శ్రీఅభయాంజనేయస్వామి, జీవ ధ్వజ శిఖర యంత్ర విగ్రహాలను ఘనంగా ప్రతిష్ఠించారు. మొదటి వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు చేశారు. గ్రామదేవతలకు స్థానికి ఆడపడుచులు, మహిళలు జలాభిషేకం, బోనాలు సమర్పించారు.

మున్నూరు కాపుల సంక్షేమానికి కృషి



మున్నూరు కాపు సంఘం కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కనకేష్

పాల్వంచరూరల్: మున్నూరు కాపుల సంక్షేమ కోసం ఉచితంగా సేవలు అందిస్తామని మున్నూరు కాపు పటేల్స్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాంపెల్లి కనకేష్ అన్నారు. స్థానిక నటరాజ్ సెంటర్‌లో ఆదివారం నూతనంగా ఏర్పాటు చేసిన మున్నూరు కాపు సంక్షేమ సంఘం కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. మున్నూరు కాపుల సమస్యల పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామన్నారు. సంఘం సమష్టి కృషితో సొంత భవనాన్ని ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తోట మల్లేశ్వరరావు, చింతానాగరాజు, ఆకుల ఆనంద్, ఎంపీటీసీ మొద్దుల వీరమోహన్‌రావు, వీసంశెట్టి విశ్వేశ్వరరావు, బాలినేని సత్యనారాయణలు పాల్గొన్నారు.

రెండింటి మధ్య రేవడి!

నిత్యం ప్రమాదాలు
- గుంతలమయంగా ఎదురుగడ్డ రోడ్డు
- పట్టువీడని మున్సిపల్, పంచాయతీ పాలకపక్షాలు

కొత్తగూడెంరూరల్: కొత్తగూడెం మున్సిపాలిటీ మురుగు ఎదురుగడ్డ గ్రామ పంచాయతీలోని ఆర్అండ్‌బీ రోడ్డుపైకి రావడం వల్ల ఆ రోడ్డంతా గుంతలమయంగా మారింది. నిత్యం వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. నాలుగేళ్లుగా ఇదే పరిస్థితి. అయినా మున్సిపాలిటీ అధికారులు పట్టించుకోకపోవడం వల్ల, ఎదరుగడ్డ గ్రామ పంచాయతీలోని ఆర్అండ్‌బీ రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడుతున్నాయి. ఈ గుంతలలో మున్సిపాలిటీ నుంచి వచ్చే మురుగు చేరి రోడ్డంతా అస్తవ్యస్తంగా తయారయింది. ఈ రోడ్డు ఎంజీ రోడ్డు నుంచి ప్రధాన రహదారి అయిన ఎదరుగడ్డ, కారుకొండ, మీదుగా ఇల్లెందు క్రాస్ రోడ్డుకు కలుస్తుంది. దీంతో వాహనాలు స్థానిక రైల్వే స్టేషన్ మీదుగా ఎదరుగడ్డ, హేమచంద్రాపురం, ఇల్లెందు క్రాస్ రోడ్డు మీదుగా ఇల్లెందు వెళ్తారు. స్థానిక రైల్వే స్టేషన్ నుంచి కారుకొండ, ఇల్లెందు, మార్గం మధ్యలో ఎదురుగడ్డ పంచాయతీలో రోడ్డుపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. మున్సిపాలిటీలో 16, 17 వార్డులలో డ్రైయినేజీ మురుగు అంతా ఎదరుగడ్డ రోడ్డుపైకే వస్తుంది. అంతేకాకుండా సమ్మిరెడ్డి కుంటలోకి వెళ్తుంది. దీని వల్ల ఇక్కడ తటాకాన్ని తలపిస్తోంది. వేరే దారి లేక ఇదే రోడ్డు గుండా వాహనాలు వెళ్తుండడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో సర్పంచ్ ఆధ్వర్యంలో స్థానికులు పలుమార్లు ధర్నాలు చేశారు. మున్సిపాలిటీ అధికారులు, కౌన్సిలర్లు వచ్చి ట్రంచ్ కొట్టి మురుగును మళ్లిస్తామని హామీ ఇచ్చారు. కానీ వీరు ఒప్పుకోలేదు.



ధర్నా చేస్తున్న గ్రామస్తులు (ఫైల్)

మున్సిపాలిటీ డ్రైయినేజీ ఎదరుగడ్డ గ్రామ పంచాయతీలోకి రావొద్దని భీష్మించుకున్నారు.

దీంతో ఈ సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదు. ఇదిలా ఉంటే పాత పోలీసు స్టేషన్ నుంచి ఎదరుగడ్డ రోడ్డు వరకు తారురోడ్డు, ఇరువైపుల సైడ్ కాలువలకు రూ.2 కోట్లు మంజూరయ్యాయి. మున్సిపాలిటీ మురుగు నీరు లోతట్టు ప్రాంతానికి వెళ్తుందని అధికారులు చెప్పుండగా.. రాకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ పట్టింపుల వల్ల సమస్య కొలిక్కి రావడం లేదు. స్థానికులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



ఎదురుగడ్డలో తారు రోడ్డు దుస్థితి ఇలా..

కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం..

ఇల్లెందు క్రాస్ రోడ్డుకు వెళ్లేప్రధాన రహదారిపై మున్సిపాలిటీ మురుగు వల్ల గుంతలు ఏర్పడ్డాయి. వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అయినా మున్సిపాలిటీ అధికారులు పట్టించుకోవటం లేదు. కలెక్టర్‌ను కలిసి సమస్యను విన్నవిస్తాం.
– మాలోతు కవిత, సర్పంచ్, ఎదురుగడ్డ

సమస్య పరిష్కరిస్తాం..

ఎదురుగడ్డ పంచాయతీలోని తారు రోడ్డుపైకి మున్సిపాలిటీ మురుగు వెళ్తోంది. ఇక్కడ కల్వర్టు నిర్మాణం చేసి సమస్యను పరిష్కరిస్తాం. 16వ వార్డులో రూ.50 లక్షల నిధులకు త్వరలో టెండర్ పిలుస్తాం. ఎదరుగడ్డ ప్రజల సమన్వయంతో సమస్యకు పరిష్కారం చూపిస్తాం. అందరూ సహకరించాలి. – రాము, ఏఈ, కొత్తగూడెం మున్సిపాలిటీ

బీఆర్ఎస్ గెలుపును ఏ శక్తీ అడ్డుకోలేదు

కొత్తగూడెంటౌన్: నేను టూరిస్టుని కాను.. నిత్యం ప్రజల్లో ఉండే నాయకుడినని, పేదల ప్రజల్లో వెలుగులు నింపడమే తెలంగాణ ప్రభుత్వం లక్ష్యమని, ఆత్మీయ సమ్మేళనంలో మిమ్మల్ని కలవడం ఆనందంగా ఉందని కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరావు అన్నారు. ఆదివారం కొత్తగూడెం మున్సిపాలిటీ ప్రజలతో కొత్తగూడెం రామాటాకీస్ ఏరియాలో బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. వనమా మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ప్రజలతో మమేకయ్యేందుకు క్షేత్రస్థాయిలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించినట్లు చెప్పారు. రూ.3 వేల కోట్లతో కొత్తగూడెం నియోజకవర్గం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని, కొత్తగూడెం చిరకాల కోరిక క్రమబద్ధీకరణ పట్టాలను పంపిణీ చేశానని, వచ్చే నెలలో కొత్తగూడెం, పాల్వంచ పట్టణాల్లో రూ.250 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభిస్తామన్నారు. కొత్తగూడెంకు మెడికల్ కళాశాల, నర్సింగ్ కళాశాలలను



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరావు

తీసుకొచ్చానని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ గెలుపును ఏ శక్తి అడ్డుకోలేదన్నారు. వనమా రాఘవేందర్‌రావు, మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి, వైస్ చైర్మన్ దామోదర్, ఎంఏ రజాక్, కాసుల వెంకట్, కోలాపూరి ధర్మరాజు, అఫ్జల్ ఉన్నిసాబేగం, అంబుల వేణు, పల్లపు లక్ష్మణ్, కనుకుంట్ల పార్వతి, దుంపల అనురాధ, కేకే శ్రీను, కాపు కృష్ణ, శ్రీనివాసరెడ్డి, పల్లి కుమార్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల ప్రారంభం ఎప్పుడో?

పాల్వంచరూరల్: ఈ ఏడాది జనవరి 5వ తేదీన రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ చేతుల మీదుగా పాల్వంచ బస్టాండ్ అభివృద్ధి కోసం రూ.41లక్షలు మంజూరు చేశారు. అభివృద్ధి పనులకు శంకుస్థాపన కూడా చేశారు. నాలుగు నెలలు గడిచినా నేటికీ పనులు ప్రారంభానికి ముహూర్తం కుదరలేదని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ విమర్శించారు. ఆదివారం స్థానిక బస్టాండ్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అభివృద్ధి అంటే కేవలం శిలాఫలకాలేనా అని ప్రశ్నించారు. కనీస సౌకర్యాలు లేక బస్టాండ్‌లో ప్రయాణికులు ఇక్కట్లు పడుతున్నారని చెప్పారు. మంత్రి శంకుస్థాపన చేసిన పనులకే దిక్కులేకుండా పోయిందన్నారు. ఇప్పటికైనా



శిలాఫలకం వద్ద మాట్లాడుతున్న కామేష్

బస్టాండ్‌ను అభివృద్ధి చేసి ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో సాయి, కేతిని కుమారి, ఎడెల్లి మర్థమ్మ, ఎర్రంశెట్టి రాజేశ్వరీ, మంజు, గుంజ సరోజ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక విప్లవ సృష్టికర్త రాజీవ్‌గాంధీ

ఇల్లెందు: భారతదేశానికి శాస్త్ర, సాంకేతిక రంగాన్ని విస్తరింపజేసిన సాంకేతిక విప్లవ సృష్టికర్త మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ అని పట్టణ, మండల అధ్యక్షుడు దొడ్డా డానియేల్, పులి సైదులు అన్నారు. ఆదివారం ఇల్లెందు జగదాంబా సెంటర్, పట్టణ కాంగ్రెస్ కార్యాలయంలో రాజీవ్ గాంధీ 32వ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్‌గాంధీ విగ్రహాలకు, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రజల కోసం నిరంతరం పోరాడి, ప్రజాసేవకే తన జీవితం అంకితం చేసిన మహానీయుడు రాజీవ్ గాంధీ అని కొనియాడారు. రాష్ట్రంలో రానున్న రోజుల్లో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొచ్చేందుకు ప్రతీ కార్యకర్త సైనికుడై పోరాడాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు సుదర్శన్‌కోరీ, ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షులు లింగాల జగన్నాథం, ఇబ్రహీం, జీవీ భద్రం, ఎట్టి హరికృష్ణ, మహబూబ్ జాఫర్, శ్రీనివాస్, మసూద్, గాలిపల్లి స్వరూప తదితరులు పాల్గొన్నారు.



ఇల్లెందులో రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు

నేడు బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనం

ఇల్లెందురూరల్: మండలంలోని కొమరారం గ్రామంలో బీఆర్ఎస్ మండల స్థాయి ఆత్మీయ సమ్మేళనం సోమవారం నిర్వహిస్తున్నట్లు బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు శీలం రమేష్, ఖమ్మంపాటి రేణుక ఆదివారం తెలిపారు. మండలంలోని పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, బీఆర్ఎస్ అభిమానులు ఉదయం పదిగంటలకు ప్రారంభమయ్యే ఆత్మీయ సమ్మేళనానికి హాజరు కావాలని కోరారు.

సీపీఎం నాయకుడు మృతి



రాములు (ఫైల్)

ఇల్లెందు: పట్టణంలోని కాకతీయ నగర్‌కు చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు అల్లోదుర్గం రాములు (82) ఆదివారం మృతి చెందారు. కొంత కాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన వారం రోజులుగా తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. సీపీఎం ఇల్లెందు పార్టీ నిర్మాతల్లో రాములు ఒకరుగా ఉన్నారు. సీనియర్ నాయకుడు, మాజీ పట్టణ కార్యదర్శిగా కూడా పని చేశారు. అలాగే సీఐటీయూలో ముఖ్యులుగా సుదీర్ఘకాలం పని చేసిన రాములు భార్య సత్తెమ్మ మాజీ కౌన్సిలర్‌గా పని చేశారు. ఆయనకు ఐదుగురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. రాములు మృతి పట్ల సీపీఎం పట్టణ, మండల కమిటీ తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది.

గురుకుల కళాశాలలు ఏర్పాటు చేయాలి

కొత్తగూడెంటౌన్: రాష్ట్రంలో మైనార్టీ గురుకుల డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని జిల్లా మైనారిటీ అధ్యక్షుడు ఎండీ యాకూబ్‌పాషా ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా 204 మైనార్టీ గురుకుల జూనియర్ కళాశాలల్లో 20,400 మంది విద్యార్థులు ప్రతి ఏటా ఇంటర్మీడియట్, ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాసి బయటకు వెళ్తున్నారని తెలిపారు. మైనార్టీలకు గురుకుల డిగ్రీ కళాశాలలు లేనందున అనేక మంది విద్యార్థులు గత మూడేళ్ల ఇంటర్ తరువాత చదువులకు స్వస్తి పలుకుతున్నారని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు గురుకుల కళాశాలలు ఉన్నట్లుగానే మైనారిటీలకు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రికి లేఖ ద్వారా తెలియజేయనున్నట్లు తెలిపారు.

పోడు భూములకు పట్టాలివ్వాలి



మాట్లాడుతున్న ఎస్కే ఉమర్

జూలూరుపాడు: ఎన్నో ఏళ్లుగా పోడు భూములు సాగు చేసుకొని జీవనం సాగిస్తున్న ఆదివాసీ గిరిజనులు, నిరుపేదలకు పట్టాలు ఇవ్వాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ కొత్తగూడెం డివిజన్ కార్యదర్శి ఎస్కే ఉమర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని గొల్లగూడెం గ్రామంలో జరిగిన ఆ పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోడు భూములకు పట్టాలు ఇవ్వడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం పోడు సాగుదారులందరికీ పట్టా హక్కు కల్పించాలని కోరారు. గొల్లగూడెం గ్రామంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించడంలో పాలకులు, అధికారులు విఫలమయ్యారని విమర్శించారు. గ్రామంలో వీధిలైట్లు వెలిగే పరిస్థితి లేదని, డ్రైయినేజీల్లో పూడిక నిండిపోగా, అంతర్గత రోడ్లు సక్రమంగా లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. అదేవిధంగా తాగునీటి సమస్యతో ప్రజలు అవస్థలు పడాల్సి వస్తోందన్నారు. గ్రామంలోని సమస్యలను సత్వరమే పరిష్కరించాలని, లేని పక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్)న్యూడెమోక్రసీ పార్టీ జూలూరుపాడు, సుజాతనగర్ మండలాల కార్యదర్శి వల్లోజి రమేష్, అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి కందగట్ల సురేందర్, కల్తి సురేష్, జె.నరసింహారావు, పి.రామారావు, ఏనుగు సీతయ్య, బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పల్లెల్లో స్వచ్ఛత కార్యక్రమాలు



ఒడ్డుగూడెంలో చెత్త తొలగిస్తున్న కార్మికులు

ఇల్లెందురూరల్: మండలంలోని పలు గ్రామాలలో పారిశుద్ధ్య వారోత్సవాలలో భాగంగా స్వచ్ఛత కార్యక్రమాలు ముమ్మరంగా సాగుతున్నాయి. వారం రోజులపాటు గ్రామాలలో చేపట్టాల్సిన పనులపై ప్రభుత్వం ఇప్పటికే స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసింది. ఇందులో భాగంగా గ్రామపంచాయతీల్లో కార్యదర్శులు రోజువారీ ప్రణాళికను అమలు చేసే పనులలో నిమగ్నమయ్యారు. ప్రధాన రహదారుల వెంట చెత్త తొలగించడం, మురుగుకాల్వలను శుభ్రం చేయించడం, నీరు నిల్వ ప్రాంతాలలో మట్టి పోయించడం, దోమల నియంత్రణకు ఫాగింగ్ వంటి పనులను పలు గ్రామపంచాయతీలలో అమలు చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఆదివారం పలు గ్రామాలలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. రహదారి వెంట పెరిగిన పిచ్చి మొక్కలను, పేరుకుపోయిన చెత్తను తొలగించారు.

నేడు కలెక్టరేట్ ఎదుట ధర్నా

పాల్వంచరూరల్: ఐకేపీ వీఓఏల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో కొనసాగుతున్న నిరవధిక సమ్మెలో భాగంగా నేడు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేయనున్నట్లు సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కె.సత్య తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట దీక్షా శిబిరం వద్ద ఆదివారం ఆమె మాట్లాడారు. ప్రభుత్వం వీఓఏలకు గతంలో ఇచ్చిన హామీలను అమలుచేయకపోగా పనిభారం పెంచిందన్నారు. వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి గుర్తింపుకార్డులు జారీ చేయాలని, గ్రేడింగ్ పద్ధతి రద్దు చేయాలని, సీసీలుగా పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వీఓఏల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వి.అనురాధ, ఎస్.రమేష్, రమాదేవి, ఉమామహేశ్వరీ, కల్పన, మౌనిక, జయ, మీనాకుమారి, రమణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సత్య

మాజీ ఎమ్మెల్యే జలగం పరామర్శ

సుజాతనగర్: సుజాతనగర్‌కు చెందిన 4వ వార్డు సభ్యుడు సాయి మణికంఠ కుటుంబ సభ్యులను కొత్తగూడెం మాజీ ఎమ్మెల్యే జలగం వెంకట్రావు ఆదివారం పరామర్శించారు. సాయి మణికంఠ తల్లి ఉబ్బనపల్లి సుజాత అనారోగ్యంతో ఇటీవల మృతి చెందింది. విషయం తెలుసుకున్న జలగం వారి ఇంటికి వెళ్లి సుజాత చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు సానుభూతి ప్రకటించారు. కార్యక్రమంలో జలగం యువసేన నాయకులు చింతలపూడి జగన్, యాకుబ్ అలీ, గూని వీరభద్రరావు, లావుడ్యా గోపి, మండె చంటి తదితరులు పాల్గొన్నారు.



సుజాతకు నివాళులర్పిస్తున్న జలగం వెంకట్రావు

భారీ వర్షంతో అతలాకుతలం



మంగళితండాలో లేచిపోయిన ఇంటి పైకప్పు



మద్రాస్‌తండా వద్ద రోడ్డుపై విరిగిపడిన చెట్లు

ఇల్లెందురూరల్: మండలంలో శనివారం రాత్రి కురిసిన భారీ వర్షం ప్రజలను భయాందోళనకు గురిచేసింది. రాత్రివేళ రేకుల ఇళ్లపై వడగండ్లు పడడంతో పలుచోట్ల రేకులు పగిలిపోయాయి. వర్షంతోపాటు ఈదురుగాలులు వీచడంతో పోలారం, బోయితండా గ్రామాలలో పలు ఇళ్లు పూర్తిగా నేలమట్టమయ్యాయి. భారీ వృక్షాలు కూలిపోయాయి. కొమరారంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రంలో రైతులు తెచ్చిన మొక్కజొన్నలు తడిసిపోయాయి.

టేకులపల్లి: మండలంలో శనివారం కురిసిన అకాల వర్షంతో నష్టం వాటిల్లింది. రాత్రి 9 గంటల వరకు అతలాకుతలం చేసిన గాలి వాన.. తిరిగి 11 గంటల తరువాత విజృంభించింది. మంగళితండాలో లాకావత్ భద్రు రేకుల ఇల్లు పైకప్పు మొత్తం గాలికి ఎగిరిపోయింది. సుమారు రెండు లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. ఇంకా పలు గ్రామాల్లో ఇళ్లు నేలమట్టమయ్యాయి. విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. చెట్లు విరిగి విద్యుత్ తీగలపై, రోడ్లపై పడిపోయాయి. పంచాయతీ సిబ్బంది వాటిని తొలగించారు. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

వెట్టిచాకిరీ నుంచి విముక్తి కల్పించండి



టేకులపల్లిలో సమ్మె చేస్తున్న వీఓఏలు

టేకులపల్లి: ఐకేపీ వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని తెలంగాణ ఐకేపీ వీఓఏ ఉద్యోగుల సంఘం (సీఐటీయూ) ఆధ్వర్యంలో నిరవధిక సమ్మె కొనసాగుతోంది. ఈ మేరకు ఆదివారం 35వ రోజుకు చేరింది. నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణలో ఐకేపీ వీఓఏలు వెట్టిచాకిరీ చేస్తున్నారన్నారు. రాష్ట్ర వ్యాపితంగా వీఓఏల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా సమ్మె చేస్తున్నామని తెలిపారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని, రూ.10 లక్షల సాధారణ బీమా, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని, సెర్ప్ నుంచి ఐడీ కార్డులు ఇవ్వాలని, గ్రామ సంఘం గ్రేడింగ్‌తో సంబంధం లేకుండా ప్రతి నెల వ్యక్తిగత ఖాతాల్లో వేతనాలు జమ చేయాలన్నారు. ఆన్‌లైన్ పనులు చేయించకూడదని, అర్హులైన వీఓఏలను సీసీలుగా ప్రమోషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి మూడ్ చరణ్, మండల అధ్యక్షురాలు చంద్రకళ, గౌసియా, జయ, నాగమణి, స్వప్న, కావేరి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఇల్లెందురూరల్: కొమరారం, పోలారం గ్రామాల మధ్య ప్రధాన రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రంగా గాయాలయ్యాయి. ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం ఉసిరికాయలపల్లి గ్రామానికి చెందిన వారం నరేందర్, గొగ్గెల ప్రదీప్ బైక్‌పై గుండాల వెళ్తుండగా కొమరారం సమీపంలో వాహనం అదుపు తప్పడంతో ఈ ప్రమాదం జరిగింది. క్షతగాత్రుతను అటుగా వచ్చిన ప్రయాణికులు వెంటనే కొమరారం ఆస్పత్రికి చేర్చారు. పరీక్షించిన వైద్యురాలు డాక్టర్ లోహిత ప్రథమ చికిత్స అనంతరం ఇల్లెందు ఆస్పత్రికి సిఫారసు చేశారు. అక్కడ వైద్యులు సేవలందిస్తున్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఇల్లెందు: పూర్వవిద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనంలో నాటి తీపి గుర్తులను నెమరువేసుకున్నారు. పట్టణంలోని టైనీటాల్ పబ్లిక్ స్కూల్‌లో 2001–2002లో పదో తరగతి చదువుకున్న 40 మంది విద్యార్థులు ఇల్లెందులో గెట్ టూ గెదర్ ఏర్పాటు చేసుకున్నారు. ఆనాటి మధుర జ్ఞాపకాలను పంచుకున్నారు. గురువులను సత్కరించారు.

టేకులపల్లి: బేతంపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2008–09లో పదో తరగతి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆదివారం హైస్కూల్ ఆవరణలో కలుసుకుని చిన్ననాటి మధుర స్మృతులను పంచుకున్నారు. నాటి ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులను సాదరంగా ఆహ్వానించి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఆటపాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బాబు, ఉప సర్పంచ్ సత్యనారాయణ, పూర్వ విద్యార్థులు శాంతి, పూర్ణచందర్, వేణు, అశోక్, మహేష్, సౌజన్య, నవీనా పాల్గొన్నారు.





ఇల్లెందు: ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు, టేకులపల్లి: బేతంపూడి హైస్కూల్‌లో 2008-09 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు